
ప్రజా విశ్వంభర

# 'జన నాయగన్'కు మళ్లీ చుక్కెదురు!






**విశ్వంభర, సినిమా బ్యూరో:** దళపతి విజయ్ కథానాయకుడిగా, దర్శకుడు హెచ్.వినోద్ కాంబినేషన్‌లో రూపొందిన 'జన నాయగన్' చిత్రానికి సెన్సార్ కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. ఈ సినిమాకు 'యూ/ఏ' (U/A) సర్టిఫికెట్ ఇవ్వాలంటూ గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ తాజాగా రద్దు చేసింది. ఈ వ్యవహారంపై మళ్లీ విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకోవాలని కేసును తిరిగి సింగిల్ బెంచ్‌కే రిఫర్ చేసింది. మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం వెలువరించిన తీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమాలోని అంశాలపై సెన్సార్ బోర్డుకు (CBFC) తన వాదనలు వినిపించేందుకు పూర్తిస్థాయిలో న్యాయపరమైన అవకాశం కల్పించాలని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ చిత్రాన్ని రివైజింగ్ కమిటీకి పంపాలన్న నిర్ణయం సరైనదా? కాదా? అనే అంశాన్ని సింగిల్ జడ్జి స్వతంత్రంగా, స్వేచ్ఛగా పరిశీలించాలని సూచించింది. ఈ కేసులోని అన్ని కోణాలను పరిగణనలోకి తీసుకుని, మరోసారి సమగ్ర విచారణ జరిపి ఆదేశాలు జారీ చేసే అధికారం సింగిల్ బెంచ్‌కు ఉందని స్పష్టం చేసింది.

**వివాదం నేపథ్యమిదే**

'జన నాయగన్' చిత్రానికి సర్టిఫికెట్ ఇచ్చే విషయంలో సెన్సార్ బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ వివాదం మొదలైంది. జనవరి 9న ఈ చిత్రానికి 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేయాలని సింగిల్ బెంచ్ ఆదేశించింది. ఈ తీర్పుపై సెన్సార్ బోర్డు డివిజన్ బెంచ్‌కు వెళ్లి స్టే తెచ్చుకుంది. నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అత్యున్నత న్యాయస్థానం మద్రాసు హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచించింది. జనవరి 21న వాదనలు విన్న డివిజన్ బెంచ్, సోమవారం తీర్పును వెలువరిస్తూ సింగిల్ బెంచ్ ఉత్తర్వులను రద్దు చేసింది.

**అభిమానుల్లో ఆందోళన**


విజయ్ రాజకీయ రంగప్రవేశం నేపథ్యంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న 'జన నాయగన్' విడుదలపై ఈ న్యాయపోరాటం నీలి నీడలు కమ్ముకున్నాయి. కోర్టు విచారణలు, సెన్సార్ సర్టిఫికెట్ ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో సినిమా విడుదల మరింత వెనక్కి వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో విజయ్ అభిమానులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

## రాష్ట్రపతి భవన్ ఎట్ హోమ్‌లో మెరిసిన సమంత



రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఎట్ హోమ్‌కు నటి సమంత రూత్ ప్రభు హాజరయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానం మేరకు అటెండ్ అయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతోపాటు ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొన్న ఎట్ హోమ్‌లో సమంత ప్రత్యేకంగా నిలిచారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు. " చిన్నప్పుడు నన్ను ఎంకరేజ్ చేసినవారు లేరు. ఏదో ఒకరోజు గొప్పదానివి అవుతావని వెన్నుతట్టినవారు లేరు. అంత ధైర్యం నాలోనూ లేదు. రాష్ట్రపతి భవన్‌కు చేరుకునే మార్గం నాకు తెలియదు. కానీ ఇక్కడికి చేరుకుంటానని కలలో కూడా ఊహించలేదు'' అని సమంత ఎమోషనల్ అయ్యింది. ఎట్ హోమ్‌లో సమంత అదిరిపోయే చీరకట్టులో మెరిశారు. ఆకుపచ్చని చీరలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా హుందాగా కనిపించారు. ఇటీవల రాజ్ నిడిమోరును పెళ్లి చేసుకున్న సమంత మళ్లీ సినిమాలతో సందడి చేయబోతోంది. ప్రస్తుతం నందిని రెడ్డి దర్శకత్వం వహించిన తెలుగు యాక్షన్ థ్రిల్లర్ 'మా ఇంటి బంగారం' నటిస్తోంది.

## 'దేవర 2' పై అధికారిక ప్రకటన




జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా గత సంవత్సరం విడుదలై అభిమానులను బాగా ఆకట్టుకుంది. ఈ సినిమాకు దర్శకుడు శివ కొరటాల ముందుగానే సీక్వెల్ ప్లాన్ చేసి, సినిమా చివర్లోనే 'దేవర 2' గురించి ప్రకటించారు. అయితే ఇటీవల ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిందని కొన్ని పుకార్లు వినిపించాయి. కానీ అవన్నీ నిజం కాదని ఇప్పుడు స్పష్టత వచ్చింది. యువసుధ ఆర్ట్స్ సంస్థ నిర్మాత సుధాకర్ మిక్కిలినేని అధికారికంగా 'దేవర 2'పై కీలక ప్రకటన చేశారు. ఈ సినిమా షూటింగ్ 2026 మే నెలలో ప్రారంభమవుతుందని, అలాగే 2027లో విడుదల చేయాలనే ప్లాన్ ఉందని తెలిపారు. ఈ అధికారిక ప్రకటనతో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల్లో మళ్లీ ఉత్సాహం పెరిగింది. ప్రస్తుతం ఎన్టీఆర్ చేతిలో నాలుగు భారీ సినిమాలు ఉన్నాయి. అవి 'దేవర 2', దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో చేస్తున్న సినిమా, త్రివిక్రమ్ దర్శకత్వంలో రానున్న ఒక పురాణ కథ ఆధారిత చిత్రం, అలాగే నెల్సన్ దిలీప్‌కుమార్‌తో మరో సినిమా. ఈ సినిమాలన్నింటితో జూనియర్ ఎన్టీఆర్ వచ్చే కొన్ని సంవత్సరాలు పూర్తిగా బిజీగా ఉండనున్నారు. ఆయన సినిమాలు 2028 వరకు వరుసగా విడుదలయ్యే అవకాశం ఉంది. అభిమానులకు ఇది నిజంగా గుడ్ న్యూస్. మరిన్ని ఆసక్తికర అప్‌డేట్స్ కోసం వేచి చూడండి.



## డేటింగ్ పై క్లారిటీ ఇచ్చిన ఈషా రెబ్బా..

తన కొత్త మూవీ ప్రమోషన్లలో నటి ఈషారెబ్బా చేసిన కామెంట్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. మొత్తంగా కొన్నిరోజులుగా తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బల మధ్య డేటింగ్ నడుస్తున్నట్లు వార్తలు జోరందుకున్న తరుణంలో ఈషా చేసిన కామెంట్స్ కొత్త చర్చకు తెరలేపాయి. సెలబ్రీటీల గురించి తరచుగా రూమర్స్ నెట్టింట వైరల్ అవుతునే ఉంటాయి. ఎవరితో అయిన కొంచెం క్లోజ్ గా కన్పిస్తే వెంటనే వారి మధ్యలో ఏదో ఒకటి ఉందని రూమర్స్ వైరల్ చేస్తుంటారు . పెళ్లి, ప్రెగ్నెన్సీ, డైవర్స్ విషయాల్లో ఇలా సెలబ్రీటీలను, రాజకీయా నేతలను ట్రోలర్స్ రాయుళ్లు తెగ వేధిస్తుంటారు. ఈ క్రమంలో టాలీవుడ్ నటి ఈషా రెబ్బా ,నటుడు తరుణ్ భాస్కర్ మధ్య కొన్నిరోజులుగా ఏదో నడుస్తుందని వార్తలునెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. దీనికి బలం చేకూర్చేలా వీరు ఎక్కడకు వెళ్లిన జంటగా వెళ్తున్నారు. తొందరలోనే వీరు పెళ్లితో ఒక్కటి కానున్నారని కూడా వార్తలు వస్తున్నాయి.

ఈ నేపథ్యంలో 'ఓం శాంతి శాంతి శాంతిః' మూవీ ప్రమోషన్లలో పాల్గొన్న ఈషారెబ్బా చేసిన కామెంట్స్ తెగ ఆసక్తిని రెకెత్తిస్తున్నాయి. దీంతో సోషల్ మీడియా రూమర్స్ నిజమైనయని అభిమానులు పండగ చేసుకుంటున్నారు. అసలు మ్యాటర్ కి వస్తే.. 'ఓం శాంతి శాంతి శాంతిః'ప్రమోషన్ లలో ఈషారెబ్బా పాల్గొన్నారు. ఇది మలయాళం జయ జయ జయ జయహే. మూవీ రీమేక్. అయితే.. ఇది అస్సలు రీమేక్ లా లేదని నటి చెప్పింది. గోదావరియాసలో భలేగా స్టోరీ ఉందని చెప్పకొచ్చింది. అన్నిరకాల ఆడియన్స్ లకు కనెక్ట్ అవుతుందని అన్నారు. మూవీ చూస్తున్నప్పడు రీమేక్ అనే ఫీలింగ్ రాదన్నారు. శాంతి క్యారెక్టర్ తనకు చాలా నచ్చిందని, ఛాలెంజింగ్ గా చేశానన్నారు.

మరోవైపు ట్రైలర్ లోచెంప దెబ్బలు అనే అంశంపై మాట్లాడారు. తనకుయాక్షన్ మూవీస్ ఇష్టమని, ఇందులో చెంపదెబ్బలు నిజంగానే తిన్నట్లు చెప్పారు. తన కళ్లలోనుంచి నిజంగా నీళ్లు వచ్చాయన్నారు. ఇక తరుణ్ కి కూడా దెబ్బలు తగిలాయన్నారు. తరుణ్ భాస్కర్ తో చేయడం చాలా నచ్చిందన్నారు.ఆయన దర్శకుడు,నటుడు కావడం వల్ల మరింత అనుకున్నట్లు సీన్స్ రావడం కోసం కష్టపడ్డామన్నారు. అయితే, ఈషా రెబ్బా మాట్లాడుతూ.. తాను ఒక వ్యక్తితో డేటింగ్ లో ఉన్నానని బాంబు పేల్చారు. కానీ, అది స్టార్టింగ్ దశలోనే ఉందని చెప్పారు. అయితే.. అతనెవరో మాత్రం చెప్పకుండా సస్పెన్స్ లో పెట్టారు. ఇంకా ఈ కామెంట్స్ వైరల్ కావడంతో అతను తరుణ్ భాస్కర్ అయ్యుంటాడని నెటిజన్లు తెగ పండగ చేసుకుంటున్నారు. మొత్తంగా ఈషా రెబ్బా తన డేటింగ్ ఫైనల్ గా హింట్ ఇవ్వడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఇక 'ఓం శాంతి శాంతి శాంతిః' ఈ నెల 30న విడుదలకు సిద్ధమవుతున్నది.

## 'ఉస్తాద్' డబ్బింగ్ షురూ






**విశ్వంభర, సినిమా బ్యూరో:** పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి సంబంధించి మేజర్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో వేగం పెంచింది. తాజాగా చిత్ర బృందం పూజా కార్యక్రమాలతో డబ్బింగ్ పనులను ప్రారంభించింది. దర్శకుడు హరీశ్ శంకర్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు పాల్గొన్న ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాలో పవన్‌కల్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ అందిస్తున్న ట్యూన్స్ ఇప్పటికే ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగిస్తున్నాయి.

**మార్చి 26న విడుదల?**

ఈ సినిమా విడుదల తేదీపై ఫిల్మ్ నగర్‌లో ఒక ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. తొలుత మార్చి 27న రామ్ చరణ్ 'పెద్ది' విడుదల కావాల్సి ఉంది. అయితే ఆ సినిమా వాయిదా పడే సూచనలు ఉండటంతో, అదే స్లాట్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. 'ధురంధర్ 2', 'టాక్సిక్', 'ప్యారడైజ్' వంటి భారీ చిత్రాల మధ్య ఈ సినిమా వస్తుందా లేదా అన్న సందిగ్ధతకు 'పెద్ది' వాయిదాతో తెరపడింది. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

**హరీశ్ శంకర్ క్రేజీ పోస్ట్**

చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్ తన తాజా ఎక్స్ పోస్ట్‌తో అభిమానుల్లో జోష్ నింపారు. "సంక్రాంతి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన అనిల్ రావిపూడికి మెగాస్టార్ చిరంజీవి కారు గిఫ్ట్ ఇచ్చారు. ఆ కారు వేసుకొని వస్తే.. అందులో ఉస్తాద్‌లోని 'కొత్త సాంగ్' ప్లే చేసుకుంటూ డ్రైవ్‌కు వెళ్దాం, అదే నా గిఫ్ట్" అంటూ సరదాగా ట్వీట్ చేశారు. దీన్నిబట్టి రెండో పాట విడుదలకు సిద్ధంగా ఉందని స్పష్టమవుతోంది.

## పవన్ కళ్యాణ్‌పై భూమిక ఆసక్తికర వ్యాఖ్యలు

పవన్ కల్యాణ్, భూమిక కాంబినేషన్‌లో వచ్చిన 'ఖుషి' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో, ఆయనపై నటి భూమిక చావ్లా హృదయపూర్వక ప్రశంసలు కురిపించారు. ఒకప్పటి తన సహనటుడు రాజకీయాల్లో ఉన్నత శిఖరాలకు చేరడంపై ఆమె తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ప్రస్తుతం భూమిక తన కొత్త చిత్రం 'యుఫోరియా' ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "'ఖుషి' సినిమాలో పవన్ కల్యాణ్‌తో కలిసి పనిచేసిన రోజులు ఇంకా గుర్తున్నాయి. ఒక నటుడిగా ప్రయాణం మొదలుపెట్టి, ప్రజాసేవ వైపు అడుగులు వేసి, ఇప్పుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన తీరు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. ఆయన పడిన కష్టానికి, నిబద్ధతకు ఈ విజయం ఒక నిదర్శనం. ఆయన సాధించిన ఈ స్థాయి ఎంతో మంది యువతకు ఆదర్శం" అని కొనియాడారు.

కేవలం ప్రశంసలతోనే ఆగకుండా, పవన్ కల్యాణ్‌కు తన శుభాకాంక్షలు కూడా తెలియజేశారు. "పవన్ కల్యాణ్‌కు భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆయన ప్రజలకు మరింత గొప్ప సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాను" అని భూమిక పేర్కొన్నారు. ఒక నటుడిగా అసాధారణమైన స్టార్‌డమ్ చూసి, ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి, అనేక సవాళ్లను ఎదుర్కొని ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం నిజంగా అభినందనీయమని ఆమె అన్నారు. భూమిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com